# కాకి-కోకిల

అంగర వెంకట శివ ప్రసాదరావు



'కాకి కోకిల అవుతుందా...' రేడియోలో రఫీ గొంతు వినిపిస్తోంది.

'ఆ కాకి గోల కట్టేయి నర్సమ్మా.' పక్క గదిలోంచి విసురుగా బైటికి వచ్చి అంది నీలమణి.

'ఆనందు బాబు పెట్టారమ్మా... రేడియో...' అంది నర్సమ్మ భయం భయంగా.

'వాడికి మరేం పని లేదు. స్కూల్లో వేస్తేనే గాని బుద్ధి రాదు. అయినా నాకు రేపు కచేరీ ప్రోగ్రాం వుంది కదా... అవతల నేను ప్రాక్టీసు చేసుకుంటుంటే మీరలా కళ్లు మూసుకుని ఈజీ చైర్లోపడుకోపోతే... కుర్రాణ్ణి అలా బైటికి తీసుకెళ్ల రాదూ...' ఈ మారు ఉరుము నా మీద పడింది.

ఆ హాల్లో ఓ మూల ఈజీ చైర్లో పడుకొని నా లోకంలో నేను వుంటే నన్నీ లోకంలోకి లాక్కొచ్చింది నీలమణి గొంతు. అదే గొంతు రేపు రవీంద్రభారతిలో ఖంగుమని కంచు గంటలా ఎలా గమకాలు పలుకుతుందో... జనం వేలం వెర్రిగా ఆ గొంతు పలికే రాగాలకి చప్పట్లు కొడతారో అర్థం కాలేదు నాకు.

శిశువుల్ని, పశువుల్ని కూడా పరవశింపజేసే సంగీతం నాయింట్లో నిత్యం నాట్యమాడుతుంటే నాలో ఈ స్తబ్దత నిండుకోడానికి కారణం వేరే వుంది.

* * *

'అమ్మాయి కడిగిన ముత్యంలా వుంది.' అమ్మ నా పెళ్లి చూపుల్లో నీలమణిని చూడగానే కామెంట్ చేసింది.

నాన్నగారు అందుకు వంత పాడారు.

నా చూపు నీలమణి నల్లటి కురుల మధ్య పాపిట్లోంచి ముఖం మీదకి పాకింది. నుదుట ఎర్రటి తిలకం. చక్కటి కనుదోయి, తీరైన ముక్కు, ఎర్రటి పెదవుల నోరు, కెంపుల్లాంటి చెక్కిళ్లు.. శంఖం లాంటి కంఠం దగ్గర ఆగిపోయాయి నా చూపులు.

అప్పుడే ఆమె బెదురుతూ గుటకలేసింది. నా కళ్లకి అది స్పష్టంగా కనిపించింది.

ఆ కంఠం ఎంత తీయగా వుంటుందో వినాలని పించింది.

నా నోట్లో మాట నోట్లో వుండగానే అమ్మ అందుకుంది.

'అమ్మాయికి పాటలేమైనా వచ్చాండీ...' అంటూ.

'కచేరీలు పెట్టేంత నేర్చుకోలేదండీ మా అమ్మాయి... ఏదో సరదాగా పాడుకోడానికి మాత్రం నేర్చుకొంది.' అన్నారు వాళ్ల నాన్నగారు.

'ఒక్క పాట పాడమ్మా...' అన్నారు నాన్నగారు.

హిందోళ రాగమట అది. ఆ తరవాత తెలిసింది నాకు. సంగీతంలో అంత పరిజ్ఞానం లేదు గానీ... చెవులో దూదులు మాత్రం పెట్టుకోను నేను.

పాట ఎప్పుడు పూర్తయ్యిందో నాకు తెలీలేదు.

'పెళ్లయ్యాక కూడా సంగీతం నేర్చుకోవాలని మా అక్కయ్య కోరిక... అదీ బావగారు యిష్టపడితేనే...' నెమ్మదిగా అన్నడు నా కాబోయ బావ మరిది.

''నన్ను నేర్చుకోమని బలవంతం చెయ్యకపోతే నాకేం అభ్యంతరం లేదు-' నవ్వుతూ నీలమణి వేపు చూస్తు అన్నాను నేను.

కృతజ్ఞత నిండిన కళ్లతో నావేపు చూసిన నీలమణి చూపు యిప్పటికీ మర్చిపోలేను.

* * *

> **కాకి కోకిల అవుతుందో లేదో నాకు తెలీదు కానీ జాణ కోయిల మాత్రం అమాయకపు కాకి చచ్చినా కాలేదని నీలమణిని చూశాక అర్థమైంది.**

'పెళ్లయితే నా సంగీతం ఎక్కడ మూలపడుతుందోనని తెగ భయపడ్డానండీ... పెళ్లి చూపుల్లో మీరలా అనే సరికి నా మనసు కుదుట పడింది' నీలమణి నాతో మొట్టమొదటిసారి మాట్లాడిన మాటలివి.

నీలమణి సంగీత సాధనకి నేనడ్డు చెప్పక పోవడంతో ఆమె తారాస్థాయికి ఎదిగి పోయింది.

ఆమె మొట్టమొదటిసారి కచేరీయిచ్చినపుడు, ఆమెకి జరిగిన సన్మాన సభలో ఆమె నాకు కృతజ్ఞతలు చెప్పడంతో నా మనసు పులకించిపోయింది.

అప్పటికింకా ఆమె ఆనంద్ని ప్రసవించలేదు. చెప్పాలంటే ఆనందింకా ఆమె కడుపులోనే పడలేదు.

పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లా పాపా కలగలేదని ఆమె బాధ పడక పోవడం నన్నాశ్చర్యపరచినా ఆ విషయం కదిపి ఆమె మనసు బాధ పెట్టడం యిష్టం లేకనే వూరుకున్నాను.

ఆమె పురోభివృద్ధికి పిల్లలో అడ్డుగోడలవుతారని ఆమె నోటంట వినకపోయినా ఆమె వుద్దేశ్యం అదేనని... ఆమే తగు జాగ్రత్తలు తీసుకుందనీ. అదీ కనీసం నాతో సంప్రదించకుండా.. యిప్పటికీ ఆ విషయం తలచుకుంటే నా మనసు నీరు కారి పోతుంది.

మా పెళ్లయిన ఆరేళ్లకి ఆమె తన తపస్సు సడలించిందో, లేకపోతే తపో భంగమయ్యిందో తెలీదు గానీ... ఆనందు ఆమె కడుపులో పడ్డాడు.

తల్లిని కాబోతున్నానన్న ఆనంథం కన్నా, కచేరీలకి ఆటంకం కలుగుతుందేమోనన్న ఆందోళన ఆమెలో ఎక్కువ కనిపించింది.

ఏది ఏమైనా ఆనందుని కనక తప్పలేదు నీలమణికి.

పిల్లవాడి ఆలనా పాలనా చూడాలంటే నిత్యం వాణ్ని అంటిపెట్టుకు వుండాలనే నిచ్చెన తనని అందలందించేస్తుందేమోనని భయపడింది నీలమణి.

అదుగో అప్పుడే నర్సమ్మ మా యింట్లో ఆనందుకి ఆయాగా చేర్చబడింది.

నల్లగా తుమ్మ మొద్దులా వుండే నర్సమ్మ బొంగురు గొంతుతో ఆనందు ఆలనా పాలనా చూడ్డానికి కుదర్చబడిందని తెలిసి నా మనసు మొదట్లో విల విల్లాడింది.

అష్టైశ్వర్యాలు వున్నా అమ్మ పాలకి నోచుకోలేదు ఆనందు. ఆయాలే అమ్మలా పాలిచ్చి జోలపాట పాడుతూ నిద్ర పుచ్చి, నీళ్లు పోసి, సాంబ్రాణి పొగ వేసి, దిష్టి చుక్క పెట్టి, ముద్దులాడి వాడితో పాటు ఆడుకొనేది పిచ్చి నర్సమ్మ.

నర్సమ్మ కడుపు కోసం తన పాలమ్ముకుని డబ్బా పాలతో తన కొడుకుని పెంచింది.

నీలమణి కీర్తి కోసం తన కొడుకుని ఆయా పాలతో పెంచింది.

బొంగురు గొంతుకతో నల్లగా వుంటే నర్సమ్మ ఆనందుని నిద్ర పుచ్చడానికి జోలపాట పాడుతుంటే... నాకు కాకి-కోకిల కథ గుర్తుకొచ్చేది.

మధురంగా పాడే కోకిల తన పిల్లల్ని కాకి గూట్లో దొంగతనంగా చేర్చడం... పిచ్చికాకి అవి కూడా తన పిల్లలే అనుకుని తన పిల్లలతో పాటుపాలిచ్చి పెంచడం...

రఫీ గొంతు లోంచి వచ్చిన 'కాకి కోకిల అవుతుందా...' పాట ఎంత నిజమో తెలీదు గానీ... కోకిల మాత్రం చచ్చినా కాకి అవలేదని చెప్పగలను.